## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి గ్రామానికి చెందిన రమేశ్, ఎల్లూర్ గ్రామానికి చెందిన మహేశ్, కొమ్ముగూడకు చెందిన సుంపుటం లలిత, లేగల పుల్లయ్య, అగర్‌గూడ గ్రామానికి చెందిన చెన్నూరి తిరుపతిలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా.. సోమవారం మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు అందచేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్, రాజన్న, మహేశ్, రాజేశ్వర్, నగేశ్, భీమయ్య, గోపాల్, శోభన్, శ్రీకాంత్, ప్రభాకర్, రాజన్న, సత్తన్న, నారాయణ, వెంకన్న, రవి పాల్గొన్నారు.

### షీటీం సేవలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై తిరుమల

కెరమెరి: మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం షీం టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు. వారికి భరోసా కేంద్రంలో కలిగే సదుపాయాలు గురించి ఎస్సై తిరుమల వివరించారు. బాలికలకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో ఎలా ముందుకు వెళ్లాలి, సమాజంలో ఉన్న పరిస్థితులు, ఫోన్ వల్ల కలిగే లాభాలు, నష్టాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్, సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్తలు వివరించారు. అవసరమైతే డయల్ 100 కాల్ చేయాలని, భరోసా కేంద్రం 87126 70561, షీటీ 87126 70565కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీం ఇన్‌చార్జి సునీత, వియలక్ష్మి, ఇన్‌చార్జి హెచ్ఎం రమేశ్ పాల్గొన్నారు.

### కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న నారాయణ

వాంకిడి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గంగరాజ్ భీమన్న జాతరను పురస్కరించుకుని కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు దుర్గం జీవన్, వాంకిడి పట్టణ అధ్యక్షుడు మండోకర్ అనిల్, దేవస్థానం పూజారి ఆత్రం చిన్ను, పటేల్ ఆత్రం మెంగురావు, గ్రామ పెద్దలు బాపురావు, లచ్చు, రాంబాయి, కమలాకర్, మాధవరాజు, ముకుంద రావు, రమేశ్ పాల్గొన్నారు.

### కంపెనీ లెవల్ క్రికెట్ పోటీలకు ఏర్పాట్లు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల్లో మూడు రోజులపాటు కొనసాగే కంపెనీ లెవల్ క్రికెట్ పోటీలకు ఏర్పాట్లు చేసినట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రారంభమైన పోటీలు గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ భీమన్న స్టేడియంతో పాటు, మాదారం టౌన్‌షిప్‌లోని స్టేడియంలో కొనసాగుతాయని పేర్కొన్నారు. వివిధ ఏరియాల నుంచి వచ్చిన క్రీడాకారుల వసతి కోసం గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాట్లు చేశామన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఆరు జట్ల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాత్రిపూట సాధన చేసుకునేందుకు వీలుగా స్టేడియాల్లో లైట్లు, ఇతర సౌకర్యాలు కల్పించామని వివరించారు.

### ఐఎన్‌టీయూసీలో పలువురి చేరిక



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న జనక్‌ప్రసాద్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని వివిధ కార్మిక సంఘాలకు చెందిన నాయకులు సోమవారం ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి, మినిమం వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్ సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్ రావు ఆధ్వర్యంలో బీఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడిగా పని చేసిన అంబేడ్కర్‌తో పాటు టీబీజీకేఎస్ నాయకులు రమేశ్‌లకు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీపై నమ్మకంతో ఇతర యూనియన్ల నాయకులు ఐఎన్‌టీయూసీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, సత్యనారాయణ, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# చెత్తతో అదనపు ఆదాయం



సెగ్రిగేషన్ షెడ్డులో నిల్వ ఉంచిన గాజు సీసాలు, వ్యర్థాలు

- ప్రతీరోజు గ్రామంలో చెత్త సేకరణ
- ఆదర్శంగా మందగూడ గ్రామం

తిర్యాణి: గ్రామ పంచాయతీలలో పచ్చదానంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని గ్రామాల్లో ట్రాక్టర్ కొనుగోలు చేశారు. దీంతో పాటు చెత్తను వేరు చేసి నిల్వ చేసుకునేందుకు సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలను సైతం చేపట్టారు. అయితే క్షేత్రస్థాయిలో మెజార్టీ పంచాయతీలల్లో పరిశుభ్రత పనులు తూతూ మంత్రంగానే సాగుతున్నాయి. దీంతో చెత్త ద్వారా ఆదానపు ఆదాయం సమకూర్చుకోవాలనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు. అయితే అందుకు భిన్నంగా మండలంలోని కేవలం 440 జనాభా కలిగిన మందగూడ గ్రామం చెత్త సేకరణ ద్వారా ఆదనపు ఆదాయాన్ని పొందుతూ.. ఆదర్శంగా నిలుస్తోంది.

**ఆరు నెలల్లో రూ. 18 వేలు..**

మందగూడ గ్రామ పంచాయతీలోని మల్టీపర్పస్ వర్కర్లు ఆరు నెలలు సేకరించిన చెత్తను ఇటీవల అమ్మగా రూ. 18 వేలు ఆదాయం వచ్చింది. కాగా ఇందులో ఎక్కువగా గాజు సీసాలు, ప్లాస్టిక్ వస్తువులతో పాటు ఇతర చెత్త సామగ్రి ఉంది. అయితే మందగూడ పంచాయతీ పరిధిలోని ప్రముఖ మైన చింతల మాదర జలపాతం ఉండటం ద్వా రా వర్ష కాలంలో ఇక్కడి సందర్శకుల వదిలేసిన వ్యర్థాలపై పంచాయతీ సిబ్బంది దృష్టి సారించా రు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో విజ యవంతం కావడంతోనే పెద్ద మొత్తంలో చెత్త సేకరణ ద్వారా ఆదాయం సమకూరింది. ప్రస్తుతం పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో తక్కువ మొత్తంలోనే నిధులు విడుదల అవ్వున్నాయి. ఈ నేపధ్యంలో చెత్త అమ్మకం ద్వారా వచ్చిన ఆదనపు ఆదాయం గ్రామాభివృద్ధికి తోడ్పాడుతుంది. మిగతా పంచాయతీలు సైతం ఇదే విధంగా చెత్త సేకరణ పై ప్రత్యేక దృష్టి సారిస్తే తద్వారా ఆదనపు ఆదాయం పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది.

**ప్రతీరోజు చెత్త సేకరణ**



మా పంచాయతీ పరిధిలో చెత్తను మల్టీపర్పస్ సిబ్బంది క్రమం తప్పకుండా సేకరిస్తా రు. సేకరించిన చెత్తను గ్రా మంలోని సెగ్రిగేషన్ షెడ్డులో నిల్వ చేస్తారు. పంచాయతీ పరిధిలోనే చింతలమాదర జలపాతం ఉండడంతో పెద్ద మొత్తంలో చెత్త సేకరణ చేపట్టగలుగుతున్నారు.

– తుంరం గోపాల్, ఈటీసీ చైర్మన్, మందగూడ

**జనరల్ ఫండ్‌లో జమ చేశాం**

పంచాయతీ పరిధిలో గత ఆరు నెలలుగా సేకరించిన చెత్తను ఇటీవల అమ్మగా రూ. 18 వేల ఆదాయం వచ్చింది. వీటిని పంచాయతీలో జనరల్ ఫండ్‌లో జమ చేశాం. వీటిని ,గ్రామంలోని చిన్న చిన్న అవసరాలకు, అత్యవసర సమయంలో సిబ్బంది వేతనాలు అందించడానికి వినియోగించుకుంటాం.

– సురేశ్, పంచాయతీ కార్యదర్శి, మందగూడ

## తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బెజ్జూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు అక్రమంగా భూములు లేకున్నా బోగస్ పట్టాలను సృష్టించారని ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అధికారుల తీరుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. మర్థిడి గ్రామానికి చెందిన బూస సారయ్య ఇంట్లో అటవీ అధికారులు అక్రమంగా చొరబడి సోదాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. అధికార పక్షానికి కొమ్ముకాసే అధికారులను వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. అనంతరం గ్రామానికి చెందిన సత్యనారాయణ ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఇండియన్ ఆర్మీకి ఎంపిక కావడంతో శాలువాతో సన్మానించారు.

**బోనాల కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్పీ**

బెజ్జూర్ మండలంలోని పాపన్‌పేట్ గ్రామంలో నిర్వహించిన షష్టి బోనాల కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో లక్ష్మీ దేవర, భీమ దేవర విగ్రహాలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు భాజభజంత్రీలతో గ్రామస్తులు ఊరేగింపు నిర్వహించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బూస సారయ్య, యూత్ అధ్యక్షుడు దుర్గం తిరుపతి, ఖాజామైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

సాక్షి ఎఫెక్ట్

కౌటాల: పశువుల సంత నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కౌటాల పశువైద్యాధికారి ఎస్. శ్రీకాంత్ అన్నారు. సోమవారం 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన 'జోరుగా పశువుల అక్రమ రవాణా' కథనానికి పశువైద్యాధికారులు స్పందించారు. స్థానిక కౌటాల పశువుల సంతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో కుక్కి పశువులను తరలించొద్దని సూచించారు. పాలిచ్చే గోవులు, ఎద్దులు, దూడలు కబేళాలకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువులకు నీరు, ఆహారం కల్పించాలని, గర్భంతో ఉన్న పశువులను ఎట్టి పరిస్థితుల్లో తరలించరాదన్నారు. అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట పశు వైద్య సిబ్బంది ఉన్నారు.



పశువుల సంతను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

## అభివృద్ధి పనులకు భూమిపూజ

జైనూర్: కాంగ్రెస్ పాలనలో పేద ప్రజల అభివృద్ధికి ప్రజా సంక్షేమ పథకాలు అందుతాయని పార్లమెంటు ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌లు అన్నారు. సోమవారం సిర్పూర్(యూ), జైనూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కాంగ్రెస్ పాలనతోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షుడు రఫిక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు మండాడి లింగు, పంద్ర శేకు, మెస్రం జంగు, జైనూర్, లింగాపూర్ మండలాల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, లేకేందర్ పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న రాజమల్లు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో సోమవారం సింగరేణి సేవా సమితి, మాతా రీసెర్చ్ సెంటర్ ఆయుర్వేద వైద్య నిపుణులు విశ్వనాథ మహార్షి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఏరియాలోని సింగరేణి ఉద్యోగులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య శిబిరానికి హాజరు కాగా వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఎస్ఈ మదీనా బాషాలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి



పరామర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కౌటాల: బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అరె సంఘం భవనంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇటీవల పార్టీ మండలాధ్యక్షులు నాగపూరే తల్లి మృతి చెందడంతో గుండాయిపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సమావేశంలో సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్యాంరావు, మండలాధ్యక్షుడు నాగపూరే బండు, రాజు, రాజ్‌కుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

# అధ్వాన రోడ్డుపై అవస్థలు

- గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువు
- శ్రమదానంతో రహదారికి మరమ్మతులు చేసిన గ్రామస్తులు



గుంతలమయంగా మురళీగూడ రోడ్డు

పెంచికల్‌పేట్: ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా.. తమ బతుకులు మారడం లేదని గిరి గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రహదారి నిర్మించాలని ఏళ్లుగా ప్రభుత్వానికి, అధికారులకు, పాలకులకు మొరపెట్టుకున్న నేటికి తమ గ్రామానికి పక్కా రహదారి నిర్మించలేదని మురళీగూడ, జిల్లెడ గ్రామాలకు చెందిన ప్రజలకు వాపోతున్నారు. అధికారులు, పాలకుల తీరుతో గ్రామానికి అత్యవసర సమయంలో అంబులెన్సు వచ్చే అవకాశం లేదని విసుగు చెందిన గ్రామస్తులు చందాలు పోగు చేసుకుని మూడు కిలోమీటర్ల రహదారికి మరమ్మతులు చేశారు. 1350 జనాభా ఉన్న గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రైవేటు వాహనాలే దిక్కు..**

కమ్మర్‌గాం నుంచి మురళీగూడ గ్రామానికి వెళ్లేందుకు అత్యవసర సమయంలో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ గమ్యాన్ని చేరుకుంటున్నారు. గ్రామానికి 108 అంబులెన్సు వెళ్లే పరిస్థితి లేనందున గర్భిణులు ప్రతీ నెలా అనేక అవస్థలను పడుతూ వైద్య పరీక్షల కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఆస్పత్రులకు చేరుకుంటున్నారు.

**అధికారులకు విన్నవించినా..**

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించిన నేటికి సమస్య పరిష్కారం కాలేదు. ఉన్నత అధికారుల ఆదేశాలతో గ్రామంలో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరిస్తామని చెప్పినా.. నేటికి కనీసం రోడ్డు నిర్మాణం చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు, రోడ్డు సౌకర్యం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

**అత్యవసర సేవలు అందడం లేదు**



అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం 5 కిలోమీటర్లు కాలినడకన కమ్మర్‌గాం గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి బెజ్జూర్‌కు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నాం. ఏళ్లు గడిచినా.. తమకు అత్యవసర సమయంలో వైద్యం అందడం లేదు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి.

– దుర్గం సురేశ్, జిల్లెడ

**చందాలతో మరమ్మతులు**



మూడు కిలోమీటర్ల రహదారిపైన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపైన ద్విచక్రవాహనం నడవలేని పరిస్థితి. జిల్లెడ గ్రామం నుంచి కమ్మర్‌గాం వరకు మూడు కిలోమీటర్ల రహదారి మరమ్మతులు చేసేందుకు గ్రామస్తులందరూ చందాలు పోగు చేసుకుని గుంతలు పూడ్చారు.

– పొర్తెటి సాగర్, మురళీగూడ

### న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన



నిందితుడి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న అనూష కుటుంబీకులు, బంధువులు

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ మండలంలోని గన్నారం గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కమ్మరి అనూష (20) మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అనూష మృతదేహంతో నిందితుడైన సందీప్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. ఇల్లాసరం సందీప్ అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని మోసగించడంతో మనస్థాపానికి గురైన అనూష ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయమై సోమవారం ఆదివాసీ కొలావార్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకులు, బాధితురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు యువతి మృతదేహాన్ని నిందితుడి ఇంటి ఎదుట ఉంచి నిరసనకు దిగారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్, ఘటన స్థలానికి చేరుకుని నిందితుడు సందీప్‌తోపాటు ఆయన తల్లి పెంటక్కపై కేసు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే రిమాండ్‌కు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### ఉట్నూర్‌కు తరలిన కొలాం గిరిజనులు

ఇంద్రవెల్లి: మన్నెవార్లు తమ హక్కులను కాలరాస్తున్నారని, వారు ఏవిధంగా కొలవార్ కుల ధ్రువీకరణ పత్రం పొందుతున్నారనే డిమాండ్‌తో కొలాం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఐటీడీఏ ముట్టడి, మహా ధర్నా కార్యక్రమానికి ఇంద్రవెల్లి నుంచి కొలాం ఆదివాసీ గిరిజ నులు ఉట్నూర్‌కు తరలివెళ్లారు. తమ న్యాయమైన డిమాండ్ నెరవేర్చే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## రైతు సురేశ్‌కు పరామర్శ



సురేశ్‌ను పరామర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి): ఇటీవల పెద్దపులి దాడిలో గాయపడి చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న సిర్పూర్(టి) మండలం దుబ్బగూడ కాలనీకి చెందిన రైతు సురేశ్‌ను సోమవారం బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పులిదాడిలో గాయాలపాలైన రైతు సురేశ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం దత్తనవరాత్రలు ముగింపు సందర్భంగా నవేగాం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. డౌనల్ ప్రాంతంలోని సాయి బాబా ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు లెండుగురే శ్యాంరావ్, షేక్ చాంద్, అస్లాం, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

### గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ తిరుపతయ్య (51) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. 1993 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని సీసీఎస్ నందు హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గుండెపోటు రావడం వల్ల పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, డాక్టర్లు పరిశీలించి ఆయన మృతి చెందినట్లు ధృవీకరించారు. అనంతరం తిరుపతయ్య మృతదేహానికి డీఎస్పీ రామానుజం నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సహాయం కింద ఆయన కుమారుడికి రూ. 30 వేలు అందజేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయశంకర్ రెడ్డి పాల్గొన్నారు.